క్లుప్తంగా

కార్యదర్శులందరినీ బదిలీ చేయాలి



ఎంపీపీకి వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులందరినీ మూకుమ్మడిగా వేరే మండలానికి బదిలీ చేయించాలని కోరుతూ పలువురు పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో అన్ని పనులను సక్రమంగా నిర్వహించి మండలాన్ని జిల్లాలో మొదటి స్థానంలో నిలిపామన్నారు. కొద్దిరోజులుగా ఎంపీడీఓ తమను మనోవేదనకు గురిచేస్తూ, పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో సర్పంచ్‌లు చేయని పనులను కార్యదర్శులు సొంత డబ్బులతో చేయాలని, లేదంటే సస్పెండ్ చేస్తానని భయపెడుతున్నాడని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల మధ్య మేము విధులు నిర్వహించలేమని, వేరే మండలాలకు బదిలీ అయ్యేలా చూడాలని ఎంపీపీకి వినతిపత్రం ఇచ్చామన్నారు.

విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్

గజ్వేల్: నాలుగు నెలలుగా సెలవుపై వెళ్లిన గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ విధుల్లో చేరారు. సోమవారం వివిధ అధికారిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కమిషనర్ సెలవు తర్వాత కార్యాలయ అధికారి బాలకృష్ణ ఇన్‌చార్జిగా వ్యవహరించిన విషయం తెలిసిందే.

నేడు డయల్ యువర్ డీఎం

గజ్వేల్‌రూరల్: జీపీపీ పరిధిలోని ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య దయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని, ప్రయాణికులు 9959226270 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలిపితే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీ9 టికెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు టీ9 టికెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని జీపీపీ ఆర్టీసీ డీపో మేనేజర్ సురేఖ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్టీసీ, పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్లు వంద రూపాయలు చెల్లించి కండక్టర్ వద్ద టీ9 టికెట్‌ను కొనుగోలు చేసినట్లయితే రాను పోను 120కిలో మీటర్లు ప్రయాణించే అవకాశం ఉందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రయాణించవచ్చని తెలిపారు. 60 ఏళ్ల పైబడిన వారు వయస్సు ధ్రువీకరణ పత్రం లేదా ఆధార్ కార్డును బస్సు కండక్టర్‌కు చూపిస్తే టీ9 టికెట్ ఇస్తారన్నారు. ఆర్టీసీ సంస్థ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ధాన్యం డబ్బుల చెల్లింపులో జాప్యం సరికాదు

నంగునూరు మండల సమావేశంలో సర్పంచ్‌ల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ అరుణాదేవి

నంగునూరు(సిద్దిపేట): ధాన్యం అమ్మి నెలరోజులు గడిచినా డబ్బులు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ జాప అరుణ అధ్యక్షతన నంగునూరు మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని, వారంరోజుల్లో డబ్బులు వచ్చేలా చూస్తామని ఏఓ గీత, ఏపీఎం ఆంజనేయులు సమాధానం ఇచ్చారు. మూడు సంవత్సరాలుగా శానిటేషన్ బిల్లు రావడం లేదని సర్పంచ్‌లు తిప్పని రమేశ్, సీత బాలయ్య వైద్యాధికారి ప్రవీణ్‌నాయక్‌ను నిలదీశారు. తహసీల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో రావడంలేదని సర్పంచ్ వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ జాప అరుణాదేవి మాట్లాడుతూ.. అధికారులు నిర్లక్ష్యం వీడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమ, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు రేణుక, రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎంఈఓ దేశిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల(సిద్దిపేట): పెద్ద చెరువు కట్టపై మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ స్వరూపరాణి



హుస్నాబాద్: మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయకసాగర్ వద్ద మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ మంజుల



దుబ్బాకటౌన్: మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత తదితరులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌నర్సాపూర్‌లో..

ఊరూరా ఉత్సాహంగా హరితోత్సవం

జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చెరువు కట్టలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్ల ఆవరణలో సిబ్బంది మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు.



మిరుదొడ్డి(దుబ్బాక): అల్వాలలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు



మద్దూరు(హుస్నాబాద్): మొక్క నాటుతున్న జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): పచ్చదనంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలుస్తుందని, ఇది సీఎం కేసీఆర్ దార్శనికతకు నిదర్శనమని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం హరితోత్సవ కార్యక్రమాన్ని మద్దూరు మండల కేంద్రంలో నిర్వహించి మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకొని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని పెద్దచెరువు కట్టపై మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు మొక్కలు నాటారు. ముస్త్యాలలో సర్పంచ్ ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొని మొక్కలు నాటారు.

హుస్నాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

తొగుట(దుబ్బాక): నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని డీఆర్‌డీఏపీడీ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లన్నసాగర్ కట్ట సమీపంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఆయన మొక్కలు నాటారు.

దుబ్బాకటౌన్: హరితహారంలో మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి అన్నారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణ, సీఎం కేసీఆర్ పాఠశాలలో కమిషనర్ గణేశ్‌రెడ్డి, సీఐ మున్నూరు కృష్ణలతో కలిసి ఆమె మొక్కలు నాటారు.

హుస్నాబాద్‌రూరల్: మొక్కలు నాటడం అందరి బాధ్యతగా తీసుకొని సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ రమేశ్, ఎంపీపీ లకావత్ మానస అన్నారు. మడద, పోతారం(ఎస్) గ్రామాల్లో వారు మొక్కలు నాటారు.



హుస్నాబాద్: పోలీస్ స్టేషన్‌లో..

చిన్నకోడూరు(సిద్దిపేట): పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల అన్నారు. సోమవారం రంగనాయకసాగర్ వద్ద 4 ఎకరాల్లో వివిధ రకాల మొక్కలు నాటారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్‌లో సర్పంచ్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైకుంఠ ధామంలో నిర్వహించిన కాక్యక్రమంలో డీపీఓ దేవకీదేవి పాల్గొని మొక్కలు నాటారు.



కొండపాక(గజ్వేల్): బొబ్బాయిపల్లిలో..



హుస్నాబాద్‌రూరల్: పోతారం(ఎస్)లో మొక్కలు నాటుతున్న ఎంపీపీ మానస



బెజ్జంకి(సిద్దిపేట): గాగిళ్లాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న డీపీఓ దేవకీదేవి గ్రామస్తులు



రాయపోలు(దుబ్బాక): రాయపోలులో..



గజ్వేల్: అహ్మదీపూర్‌లో..



నంగునూరు: తిమ్మాయిపల్లిలో..



సిద్దిపేటజోన్: మొక్కలకు నీరు పోస్తున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాజనర్సు



మర్కూక్(గజ్వేల్): మర్కూక్‌లో..



కొమురవెల్లి(సిద్దిపేట): మర్రిముచ్చాలలో..



తొగుటలో..



సిద్దిపేటరూరల్: మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు

మినీట్యాంక్ బండ్ అవినీతిపై విచారణ జరపాలి

ఇరిగేషన్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు పూర్తిచేసి, దీనిలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని సోమవారం ఇరిగేషన్ ఈఈ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.50 కోట్లు కేటాయించినా సగం వరకే ఖర్చుచేసి కట్టపై మట్టిపోసి నిధులు దుర్వినియోగం చేసి గాలికి వదిలేశారన్నారు. కట్ట పనుల్లో నాణ్యత లోపించి కట్ట బీటలు వారి గండ్లు పడ్డాయన్నారు. అదేవిధంగా కాకతీయుల కాలంలో నిర్మించిన మొదటి తూమ్‌ను తొలగించి మళ్లీ కొత్తగా నిర్మించినా తూమ్ ద్వారా నీళ్లు లీకేజీ అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. 6 సంవత్సరాలు దాటినా ట్యాంక్‌బండ్ పనులు పూర్తి కాలేదన్నారు. పట్టణ ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరేందుకు కనీసం పార్క్ లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి మినీ ట్యాంక్‌బండ్ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు, జిల్లా కోశాధికారి శ్రీనివాస్, సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, కౌన్సిలర్ వేణుయాదవ్, నాయకులు వీరాచారి, స్వరూప, కర్ణకంటి నరేశ్, సతీశ్, తోట సమ్మయ్య, శ్రీనివాస్, రాంప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ధ్రువపత్రాల జారీ ఆలస్యంపై ఆగ్రహం

తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా



ఆర్‌ఐ భిక్షపతిని నిలదీస్తున్న దరఖాస్తుదారులు

మిరుదొడ్డి(దుబ్బాక): కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీలో రెవెన్యూ అధికారులు చేతివాటం చూపడంతో పాటు తమకు కావాల్సిన వారికే అనుకూలంగా ధ్రువపత్రాలను జారీచేస్తూ మిగిలిన వారిపై వివక్ష చూపిస్తున్నారంటూ అక్బర్‌పేట–భూంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బాధితులు సోమవారం ఆందోళనకు దిగారు. బీసీ కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష రుణం ప్రకటించిన నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయానికి భారీగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి తిరిగినా రెవెన్యూ అధికారులు పట్టించుకోడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు రోడ్డుపై బైటాయించి ధర్నా చేపట్టారు. కార్యాలయంలో తగిన సిబ్బంది లేకపోగా ఉన్న సిబ్బంది సైతం సకాలంలో రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ భిక్షపతి కలగజేసుకొని సర్వర్ సమస్యతో సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతుందని బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా బాధితులు మరింత ఆవేశంతో ఊగిపోయారు. దీంతో ఆర్‌ఐ, బాధితుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసున్న భూంపల్లి పోలీసులు జోక్యం చేసుకొని ధర్నాను విరమింపజేశారు. చివరికి సర్టిఫికెట్లు సకాలంలో జారీ చేసేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని ఆర్‌ఐ భిక్షపతి నచ్చజెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సిద్దిపేటరూరల్: వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: మున్నూరుకాపు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లం డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర మున్నూరు కాపు సంఘం పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతీ సంవత్సరం రూ. 5వేల కోట్లు కేటాయించాలన్నారు. జిల్లా కేంద్రాల్లో విద్యార్థినీ, విద్యార్థులకు హాస్టల్ భవనాల నిర్మాణానికి ఎకరం స్థలం ఇవ్వాలన్నారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాస్, ఉమ, ఉప సర్పంచ్ ఉపేందర్ పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: మున్నూరుకాపు బంధు పెట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని ఐఓసీ కార్యాలయంలో ఆర్డీఓ విజయేందర్‌రెడ్డికి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నర్సింలు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): మున్నూరుకాపుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు రాజు కోరారు. ఈ మేరకు వారు బెజ్జంకి తహసీల్దార్ విజయప్రకాశ్‌రావుకు వినతిపత్రం సమర్పించారు.

సర్టిఫికెట్ల కోసం క్యూ



అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు

సిద్దిపేటజోన్: ప్రభుత్వం అమలు చేస్తున్న బీసీ రుణ దరఖాస్తులకు సర్టిఫికెట్ల కోసం ఆశావహులు సోమవారం స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. దరఖాస్తు గడువు మంగళవారంతో ముగియనున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తుదారులు తరలివచ్చారు. ఒకదశలో సిబ్బంది, దరఖాస్తుదారులు తోపులాడే పరిస్థితికి దారి తీసింది. విషయం పోలీసుల వరకు వెళ్లడంతో సీఐ భిక్షపతి ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకొని దరఖాస్తుదారులను కట్టడి చేశారు. మరో వైపు సోమవారం సర్వర్ పనిచేయకపోవడంతో సర్టిఫికెట్ల మంజూరుపై దరఖాస్తుదారుల్లో కొంత ఆందోళన నెలకొంది.

బృహత్ వనంలో కానరాని మొక్కలు!



చేలను తలపిస్తున్న బృహత్ ప్రకృతి వనం

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన హరితహారం పల్లె ప్రగతిలో ఊరూరా ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడంతో అవి పల్లె ప్రజలకు మంచి ఫలితాలను ఇచ్చాయి. ఒక ఏడాది తర్వాత మండల బృహత్ ప్రకృతి వనాలను నిర్మించాలని రెండు ఎకరాల నుంచి 10 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను గుర్తించి వేల మొక్కలు నాటించారు. హుస్నాబాద్ మండల బృహత్ ప్రకృతి వనమును జిల్లెలగడ్డ శివారులోని 5 ఎకరాల విస్తీర్ణంలో రెండేళ్ల కిందట మొక్కలను నాటించారు. ఇక్కడకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేకపోయిన ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కాలినడక వెళ్లి మొక్కలు నాటారు. మండల బృహత్ ప్రకృతి వనం చుట్టుపక్క గ్రామాల ప్రజలకు వనభోజనాలకు కేంద్రంగా మారుతుందని అప్పుడు అధికారులు అభిప్రాయపడ్డారు. ఇప్పుడు అక్కడ మొక్కలు గడ్డిలో కలిసిపోయి చేలను తలపిస్తోంది. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం హరితోత్సవాన్ని ఊరూరా పండగలా జరుపుకుంటే ఇక్కడ పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో బృహత్తర ప్రకృతి వనం కనుమరుగైంది.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



చిన్నకోడూరులో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా సిద్దిపేట యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గోపికృష్ణ, నాయకులు వాహబ్, సలీమ్, అనిల్, రాజు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు పీహెచ్‌సీలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, జయంత్, పరశురాములు, జగన్, గణేశ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: తెలంగాణలో కుటుంబ అవినీతి పాలన రాజ్యమేలుతుందని టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల అధ్యక్షుడు చందు, కౌన్సిలర్లు పద్మ, సరోజన, రాజు, మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రజిత, నాయకులు హస్సెన్, విద్యాసాగర్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో సోమవారం వేడుకలను మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొండపాకలోని ఆనంద నిలయంలో, గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వాసరి లింగారావు, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు రవి, నాయకులు రవిందర్, నరేందర్‌రెడ్డి, రాయుడు, వీరబ్రహ్మం, బాలకిషన్, రాములు, చంద్రం పాల్గొన్నారు.

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ మేరకు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

సిద్దిపేటజోన్: పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు, సీనియర్ నాయకులు మహేందర్, చంద్రం వర్మ, సతీశ్‌లక్ష్మి, అంజయ్య, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ క్షుద్రపూజల కలకలం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్ జీపీ, సర్పంచ్ సత్యనారాయణరెడ్డి ఇంటి వద్ద ఆదివారం రాత్రి క్షుద్రపూజలు చేశారని ఆనవాలను బట్టి చర్చించుకుంటున్నారు. సర్పంచ్ ఇల్లు, గ్రామ పంచాయతీ ఎదుట ముగ్గు వేసి నిమ్మకాయలు పెట్టి ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం అమవాస్య రాత్రి చేసిన పూజలు దేనికి దారితీస్తాయోనని చర్చించుకుంటున్నారు.

◆ యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేటజోన్: పట్టణంలోని మినీ స్టేడియంలో మంగళవారం జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల పోస్టర్‌ను సోమవారం సాయంత్రం నిర్వాహకులు ఆవిష్కరించారు. ఉదయం 6 గంటలకు సామూహిక యోగా ఆసనాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యోగా నిర్వాహకులు సతీశ్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, కౌన్సిలర్లు తిరుమల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

◆ నిందితులను కఠినంగా శిక్షించాలి

చేర్యాల(సిద్దిపేట): రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్యను కిడ్నాప్ చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ విక్రయిస్తున్నారన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే హత్యలు చేస్తున్నారన్నారు. హత్యకు కారకులైన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కళావతి, కార్యదర్శులు వెంకట్‌మావో, సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

◆ అందరికీ ఒకే నిబంధన ఉండాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సామాన్య ప్రజలు, ప్రజాప్రతినిధులకు ఒకే నిబంధనలు ఉండాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సోమవారం సిద్దిపేట పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అత్తు ఇమామ్ మాట్లాడుతూ.. మున్సిపల్ చట్టం తుంగలో తొక్కేలా ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ వ్యవహరిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఇల్లు సెట్ బ్యాక్ విషయమై రెండురోజుల్లో మున్సిపల్ అధికారులు నిర్ణయం తీసుకోవాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, గయాస్, ఫయాజ్, అశోక్‌గౌడ్, జీతు పాల్గొన్నారు.

◆ నేడు దుబ్బాకలో అవగాహన సదస్సు

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంలోని సీఎం కేసీఆర్ పాఠశాలలో మంగళవారం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మత్స్యసహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణలో భాగంగా చేపల ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని దుబ్బాక మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ రవీందర్, మత్స్యశాఖ అధికారులు హాజరవుతున్నారన్నారు.

◆ విద్యార్థులను అనుమతించాలి

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు సోమవారం 100 మంది విద్యార్థులు వచ్చారు. పాఠశాల ప్రారంభం నుంచి విద్యార్థులు హాజరుకాలేదని, పైఅధికారులకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి ఉంటుందని విద్యార్థులను అనుమతించలేదు. వైఎస్సార్‌టీపీ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి విషయం తెలుసుకొని పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌తో మాట్లాడి విద్యార్థులకు అనుమతి ఇప్పించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

◆ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఈ నెల 25న జరగనున్న ఏఐఎస్‌టీ 73వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు తెలిపారు. సోమవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వార్షికోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు.